
ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి. చిత్రంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తదితరులు

గండికోట నిర్వాసితులకు రూ.500 కోట్లతో ప్రతిపాదనలు

- జగన్ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నాశనం
- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం, సెప్టెంబరు 25: గండికోట నిర్వాసితులకు ముంపు పరిహారానికి రూ.500 కోట్లతో ప్రతిపాదనలు పంపామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. అన్ని వర్గాలకు మంచిచేసే మంచి ప్రభుత్వం తమదని అన్నారు. బుధవారం కొండాపురం పట్టణంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 రోజుల పాలనలో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ వందరోజుల్లోనే కొండాపురం పరిసర ప్రాంతాలకు నీటి సమస్య తీర్చడానికి రూ.7.25 కోట్లతో ఏటూరు నుంచి పైపులైను నిర్మాణానికి ఆమోదం పొందామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. సిమెంటు రోడ్లు కూడా మంజూరయ్యాయని చెప్పారు. మండలంలోని సంకేపల్లె బ్రిడ్జికి త్వరలోనే రూ.67 కోట్లతో టెండర్లు పిలుస్తారన్నారు. తిరుమల ఎక్స్‌ప్రెస్ రైల్‌కు కొండాపురంలో టికెట్లు ఇచ్చేందుకు డీఆర్‌ఎంతో మాట్లాడామన్నారు. మిగిలిన రైళ్లు కూడా కొండాపురంలో ఆపేందుకు రైల్వే అధికారులకు లేఖ రాశామన్నారు. ప్రజలు ట్రాక్టర్ లెవెల్‌కు, ఎద్దులబండ్ల ద్వారా ఇసుకను ఉచితంగా తోలుకునేందుకు అధికారులు అడ్డు చెప్పవద్దని ఎమ్మెల్యే తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని, గత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాదిరి కాకుండా తాము నిరంతరం ప్రజలకోసం పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కూటమి నేతలు విశ్వనాథరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బాబురెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా జయరాజు



కడప క్రైం, సెప్టెంబరు 25: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం.జయరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1995బ్యాచ్‌కు చెందిన ఈయన రాష్ట్రంలోని పలు ఎక్సైజ్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం విశాఖపట్నంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఇక కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సేతుపతి రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన ఒంగోలులో సెబ్ ఈసీగా పనిచేస్తూ బదిలీపై వస్తున్నారు.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషర్‌గా చంద్రశేఖర్ రెడ్డి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నాటుసారా, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యంపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచుతామన్నారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎక్సైజ్ సీఐగా కడప, తిరుపతిలో పనిచేశారు. 2014లో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. 2020లో ఈఎస్‌గా పదోన్నతి పొందారు. 2023 ఆగస్టులో అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది ఏలూరులో పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు.

పులివెందుల ఆర్‌అండ్‌బీ ఈఈగా జగన్ బంధువు

కడప, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎమ్మెల్యే, మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి బంధువు చంద్రశేఖరరెడ్డి పులివెందుల ఆర్‌అండ్‌బీ ఈఈగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయన ఎన్‌హెచ్‌లో ఈఈగా పనిచేస్తున్నారు. రాయచోటిలో పనిచేసేటప్పుడు ఆయనపై కొన్ని ఆరోపణలు ఉన్నాయని తెలిసింది. అయితే కూటమి ప్రభుత్వంలో జగన్ బంధువు పులివెందులకు బదిలీ కావడం గమనార్హం.

హౌసింగ్ పీడీ బదిలీ

గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారిగా పనిచేస్తున్న ఎం.క్రిష్ణయ్యను విజయవాడకు బదిలీ చేశారు. ఈయన గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలతో బాగా అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈయన హయాంలో గృహ నిర్మాణ శాఖలో బాగా అవినీతి చోటు చేసుకుందంటారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయనను విజయవాడకు బదిలీ చేశారు. ప్రొద్దుటూరులో పనిచేస్తున్న వి.రాజారత్నంను జిల్లా అధికారిగా నియమించారు.


చాపాడు వద్ద వంకలో బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వర్షం నీరు


కడప ఆర్టీసీ బస్టాండులో నిలిచిన వర్షపునీరు

జిల్లా అంతటా వర్షం

- బుధవారం జిల్లాలో 46.6 మి.మీ వర్షపాతం
- అత్యధికం జమ్మలమడుగు డివిజన్
- అత్యల్పం పులివెందుల డివిజన్

కడప రూరల్, సెప్టెంబర్ 25: వరుణుడు కరుణించక ఈ ఏడాది పంటలు చాలా వరకు పంటలు సాగుకు నోచుకోలేదు. అరకొర సాగైన పంటలు కూడా వాన లేక ఎండు దశకు చేరుకున్నాయి. ఇలాంటి సమయంలో ఖరీఫ్ చివరి దశలో వానలు కురుస్తున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా మూడు రోజులుగా జిల్లా అంతటా అక్కడక్కడా వర్షం కురుస్తోంది. బుధవారం తెల్లవారుజుమున జిల్లా సగటు వర్షపాతం 46.6 మిల్లీమీటర్లు నమోదైంది. ఇందులో కడప డివిజన్‌లో 416 మి.మీ నమోదుకాగా కడప మండలంలో అత్యధికంగా 90.2 మి.మీ. అత్యధికంగా నమోదైంది. వల్లూరులో 34.4, చెన్నూరులో 29.0, ఒంటిమిట్టలో 11.4, సిద్దవటంలో 52.8, సీకేదిన్నెలో 46.2, పెండ్లిమర్రిలో 81.2 మి.మీ వర్షం కురిసింది.

బద్వేల్ డివిజన్‌లో 533.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా బి.మఠం మండలంలో అత్యధికంగా 130.2 మి.మీ వర్షం కురిసింది. కాశినాయనలో 49.2, కలసపాడులో 15.4, పోరుమామిళ్లలో 40.2, బి.కోడూరులో 39.8, బద్వేల్‌లో 64.8, గోపవరంలో 43.0, అట్లూరులో 60.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జమ్మలమడుగు డివిజన్‌లో 444.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా ప్రొద్దుటూరు మండలంలో అత్యధికంగా 82.6 మి.మీ, మైలవరంలో 9.4, పెద్దముడియంలో 8.4, రాజుపాళెలంలో 65, దువ్వూరులో 78.8, చాపాడులో 44.6, జమ్మలమడుగులో 12.4, ము ద్దనూరులో 60.4, యర్రగుంట్లలో 70 మి.మీ వర్షం కురిసింది.

పులివెందుల డివిజన్‌లో 284 మి.మీ. వర్షపాతం నమోదుకాగా వీఎన్.పల్లెలో అత్యధికంగా 68.2 మి.మీ, సింహాద్రిపురంలో 18.4, లింగాలలో 24.2, పులివెందులలో 13, వేములలో 25, తొండూరులో 82.4, వేములలో 52.8, చక్రాయపేటలో 20 మి.మీ వర్షం కురిసింది.


వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డుపై ఆగి ఉన్న బద్వేలు డిపో బస్సు

బి.మఠంలో భారీ వర్షం

- బద్వేలు-బి.మఠం మధ్య రాకపోకలు బంద్

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 25: బ్రహ్మంగారిమఠం మండలంలో మం గళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. జిల్లా అంతటా వర్షం కురిసినా బి.మఠంలో ఒకే రోజు అత్యధి కంగా 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో సోమిరెడ్డిపల్లె బ్రిడ్జి వంకపైన నీళ్లు రావడంతో బద్వేలు, బి.మఠంకు రాకపోకలు దాదాపు నాలు గుగంటల పాటు నిలిచిపోయాయి.

గతంలో ఎన్నిసార్లు ప్రభుత్వానికి, అధి కారులకు విషయాన్ని తెలిపినా వంకపై బ్రిడ్జిని నిర్మించడం లేదని ప్రజలు వాపోయారు. బ్రిడ్జిపై వర్షం నీరు రావడంతో బుధవారం బద్వేలు నుంచి మొదటి బస్సు రాకపోకలు బంద్ అయ్యాయని, దాదాపు నాలుగుగంటల పాటు ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోయాయని స్థానికులు తెలిపారు.

చంద్రబాబు శ్రమ ఆదర్శనీయం

- వందరోజుల పాలనలో ప్రజా సంక్షేమం
- దీపావళి నుంచే ఏడాదికి 3 సిలిండర్లు ఉచితం
- తిరుమల లడ్డు నాణ్యతలో తప్పుచేసిన వారికి శిక్ష తప్పదు
- జడ్పీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప రూరల్, సెప్టెంబరు 25: సీఎం చంద్రబాబు నాయుడు 74 సంవత్సరాల వయసులో రాష్ట్రం కోసం, ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన కడప నగరంలోని జడ్పీ ఆవరణలో రూ.4.50 కోట్లతో నిర్మించిన జడ్పీ కాంప్లెక్స్ సముదాయాన్ని కమలాపురం, కడప ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, రెడ్డెప్పగారి మాధవి, జడ్పీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ జె.శారదతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కోటి అమలు చేస్తూ వస్తున్నామన్నారు. 100 రోజుల పాలనలోనే ప్రజాసంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలుచేసి కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందిందన్నారు. ఎన్నికలకు ముందు ఏవైతే హామీలు ఇచ్చామో అవి తప్పకుండా రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని ఏడాదికి రూ.250 పెంచుకుంటూ పోతే తమ టీడీపీ ప్రభుత్వం ఒకేసారి రూ.1000 పెంపుచేసి ప్రతి నెల ఒకటో తారీఖునే రూ.4000 ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మెగా డీ ఎ స్సీ ఫైలుపై సీఎం సంతకం చేసి మంత్రి వర్గంలో ఆమోదించామన్నారు. అతి త్వరలోనే 16,500 డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లను రద్దుచేస్తే టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి లక్షలాది మంది పేదలకు తక్కువ ధరకే భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. రానున్న 20 సంవత్సరాలు టీడీపీ అధికారంలో ఉంటుందన్నారు. దీపావళి నుంచి రాష్ట్రంలోని అర్హులైన మహిళలందరికి ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో తిరుమల లడ్డును కూడా అపవిత్రం చేసి దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. లడ్డు తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు తేటతెల్లమైందన్నారు. దీనిపై విచారణకు సిట్ ఏర్పాటైందని, తప్పుచేసిన వారికి శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ లోతేటి శివశంకర్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్, జడ్పీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ చార్జీలతో 230 ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 25: దసరా పండుగ సెలవుల రద్దీని పురస్కరించుకుని ఇతర ప్రాంతాల్లో ఉన్న జిల్లా ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులను సొంత జిల్లాకు రప్పించేందుకు వీలుగా అక్టోబర్ 8వ తేదీ నుంచి కడప రీజియన్ పరిధిలో సాధారణ చార్జీలతో 230 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ ఆర్‌ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. అందుకు వీలుగా అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి 90 బస్సులు, బెంగుళూరు నుంచి 70, విజయవాడ నుంచి 30, చెన్నై నుంచి 10, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం నుంచి మరో 30 బస్సులను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నామన్నారు. కాగా తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అక్టోబర్ 7, 8, తేదీల్లో కడప రీజియన్ నుంచి తిరుపతికి ప్రత్యేక బస్సులు కూడా నడుస్తాయన్నారు.

ఆక్రమణలు తొలగింపు

- నిబంధనల ప్రకారమే నిర్మాణాలంటున్న వైసీపీ నేతలు
- అధికారులు, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం


ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: వంకను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని బాలాజీ డెవలపర్స్ వెంచర్‌లోని ఆక్రమణలను బుధవారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరిగాయంటూ బాలాజీ డెవలపర్స్ ప్రతినిధులు, వైసీపీ నేతలు అధికారులను అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కడప నగరంలోని రామాంజనేయపురం సర్వేనెం-624-4సీలో గల ఐదెకరాల్లో బాలాజీ డెవలపర్స్ లేఅవుట్ వేశారు. వంకను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని తొలగిస్తుండగా వెంచర్స్ అధినేత, కార్పొరేటర్ బాలక్రిష్ణారెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని అధికారులను ప్రశ్నించారు. హైకోర్టు స్టే ఆర్డరు కూడా దీనిపై ఉందని అన్నారు. అదే సమయంలో మేయరు సురేశ్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. అనంతరం మేయరు మాట్లాడుతూ ఇది కేవలం కక్ష సాధింపు చర్య అని, అన్ని అనుమతులతోనే లేఅవుట్ నిర్మాణాలు జరిగాయన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, అధికారులు మాత్రం ఏ ప్రభుత్వంలో అయినా విధులు నిర్వహించవలసిందేనన్నారు. హైకోర్టు స్టే ఉన్నప్పటికీ తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు.



లేఅవుట్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న వైసీపీ నాయకులు

వంకలు, వాగులు ఆక్రమిస్తే తొలగిస్తాం : ఎస్ఈ

వంకలు, వాగులు, చెరువులు ఆక్రమిస్తే తక్షణం తొలగిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ వెంకట్రామయ్య తెలిపారు. బుధవారం ఆక్రమణల తొలగింపులో భాగంగా ఆయన మాట్లాడుతూ పెద్దిరాజుచెరువు నుంచి ఆర్‌కే పురం చెరువు వరకు ఒక ఛానల్ ఉందన్నారు. దీనిపై చాలా కాలనీలు, కళాశాలలు, ఇనిస్టిట్యూషన్స్ ఉన్నాయని తెలిపారు. అయితే కడప నగరం విస్తరిస్తున్న తరుణంలో వాగులు, వంకలను క్లియర్ చేయాలని పై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఎస్టీ కాలనీ నుంచి పెద్దిరాజుచెరువు వరకు ఉన్న ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ఈ లేఅవుట్‌లో 76 సెంట్లు ఛానెల్ ఉందని తెలిపారు. ప్రభుత్వ కాల్వను క్లీన్ చేసేందుకు ఎటువంటి నోటీసులు ఇవ్వనవసరం లేదని ఇది గతం నుంచి ఉన్నదే అని కాల్వ ఉన్నంత మేరకు తొలగిస్తామని స్పష్టం చేశారు.

ఆర్టీసీ గాడిన పడేనా..?

- ఏడాదిగా ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లకు మంగళం
- దీంతో ఆదాయానికి.. సమయపాలనకు గండి
- అయినా చోద్యం చూస్తున్న అధికారులు



సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ పెట్టింది పేరు. ఇందులో పగలూ రాత్రి తేడా లేకుండా ఉద్యోగులు (కండక్టర్లు, డ్రైవర్లు, శ్రామిక్‌లు) నిరంతరం పనిచేస్తూ ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తుంటారు. వీరికి సక్రమంగా విధులు కేటాయిస్తేనే సంస్థ ఆదాయం కూడా బాగుంటుంది. కానీ ఆ దిశగా మాత్రం అడుగులు పడటం లేదు.

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 25: ఆర్టీసీ ఆదాయం పెంపుదల కోసం సంస్థ ఆవిర్భావం నుంచి మూడు ప్రధాన అంశాలపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో ప్రధానంగా ఫిక్స్‌డ్ బస్ ఒకటి. ప్రతీ రూట్‌కు ఒక బస్సు తిరుగుతుంటే ప్రయాణికుల మదిలో అది బస్సు అనే ముద్రపడుతుంది. దానికి ఆదరణ పెరుగుతుంది. సదరు బస్‌కు ఫిక్స్‌డ్ డ్రైవర్, ఫిక్స్‌డ్ కండక్టర్‌ను సైతం నియమిస్తారు. అలా ఏర్పాటు చేయడం వలన ఆయా రూట్‌లలో ఎక్కడ ప్రయాణికులు ఎక్కువగా బస్సులో ఎక్కుతారు, ఎక్కడ తక్కువ సంఖ్యలో ఉంటారు, రోడ్డుపై ఎక్కడ గుంతలున్నాయి, ఎక్కడ స్పీడ్ బ్రేకర్లున్నాయి... అనే విషయాలతో పాటుగా ఎవరి డ్యూటీలు వారు చేయడం వలన సమయపాలనతో పాటు సంస్థ ఆదాయం బాగా ఉండేది. పైపెచ్చు ఆయా బస్సుల మరమ్మతులు కూడా తక్కువగా వచ్చేవి.

మోకాలడ్డుతున్న యూనియన్ల పాలెగాళ్లు

కడప రీజియన్ పరిధిలోని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోలలో సుమారు 598 బస్సులుండగా 2,283 మంది కండక్టర్లు, డ్రైవర్లు సేవలందిస్తున్నారు. ఆయా డిపోలలో ఇదివరకు ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు అమల్లో ఉండేవి. దీంతో వారికి కేటాయించిన డ్యూటీలలో వారు నిమగ్నమై సంస్థ ఆదాయ పెంపుదల కోసం పాటుపడేవారు. కాలగమనంలో ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు, హక్కుల సాధనకోసం వెలసిన వివిధ యూనియన్ (అసోసియేషన్)లకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు పాలెగాళ్లుగా మారడంతో ఆయా డిపోలలో ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు వేయనివ్వకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైతే కడప డిపోలో తూతూ మంత్రంగా కండక్టర్ల చార్ట్ వేసి డ్రైవర్ల చార్ట్‌కు మంగళం పలికారు. ఇక మైదుకూరు, బద్వేల్ డిపోలలో యూనియన్ పాలెగాళ్ల హవా కారణంగా ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు ఏడాదిగా వేయలేదు. మిగతా ప్రొద్దుటూరు. జమ్మలమడుగు, పులివెందుల డిపోలలో మాత్రం ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్ అమల్లో ఉంది. ఇప్పటికీ కడప, మైదుకూరు, బద్వేల్ డిపోలలో ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు వేయకపోవడం వలన బస్సుల ఫెయిల్యూర్స్ అధికం కావడంతో పాటు ఆయా రూట్‌లలో సరైన అవగాహన లేని డ్రైవర్లు, కండక్టర్లు వెళుతుండటంతో సంస్థకు వచ్చే ఆదాయం దెబ్బతింటోంది. ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్ వేయాలని సంస్థ నిబంధన లున్నా ఆచరణలో ఫలించడం లేదు. ఉద్యోగ సంఘాల పేరుతో చలామణి అవుతున్న కొంతమంది నేతలే కావాలని రకరకాల కారణాలతో ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు వేయనీకుండా చేస్తున్నారని కండక్టర్లు, డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఇదిలావుండగా కొంతమంది సూపర్‌వైజర్లు కూడా ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు వేస్తే తమ హవా తగ్గిపోతుందని వేయనివ్వకుండా యూనియన్ నేతలతో జతకడుతున్నారనే ఆరోపణలున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

కడప రీజియన్ పరిధిలోని కడప, మైదుకూరు, బద్వేల్ డిపోలలో సంవత్సరానికి పైగా ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు అమలుకాలేదు. అయినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు ఈ విషయంలో సరైన చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంస్థ ఆదాయ పురోగతి కోసం త్వరితగతిన ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లు అమలయ్యేలా చూడాలని పలువురు డ్రైవర్లు, కండక్టర్లు కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. త్వరలో ఆర్టీసీలో బదిలీలున్నాయని అవి కాగానే కడప, మైదుకూరు, బద్వేలు డిపోలలో ఫిక్స్‌డ్ డ్యూటీ చార్ట్‌లను అమలు చేస్తామని చెప్పారు.

అక్రమ మట్టి రవాణాను అడ్డుకోండి

- ఆర్డీవోకు ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి వినతి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 25: పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల, వేముల, వేంపల్లె మండలాల్లో పలు నిర్మాణ సంస్థలు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆర్డీవో వెంకటేశులుకు వినతిపత్రం అందించారు. బుధవారం ఆయన ఆ వినతిపత్రం ద్వారా ఆర్డీవోకు వివరిస్తూ పులివెందుల నియోజకవర్గం పరిధిలో బెంగళూరు, అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్నాయని, ఈ రహదారి వల్ల ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయన్నది వాస్తవం. కానీ రహదారి పనులు చేస్తున్న నిర్మాణ సంస్థలు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్, రాయిని అనధికారికంగా తరలిస్తున్నారన్నారు. ఒక గంపెడు మట్టి తీయాలన్నా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని.. కానీ వారి నిర్వాకం వల్ల ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయం రాకుండా పోతుందన్నారు. అలాగే ఈ ప్రాంతం స్థానిక సంస్థలకు కూడా ఆదాయం లేదని.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



ఎర్రగుంట్ల, సెప్టెంబరు 25: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో బుధవారం సాయంత్రం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. ఎర్రగుంట్ల పట్టణంలోని శ్రీరాములపేటకు చెందిన రాజగోపాల్‌రెడ్డి (32) ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌ కంపెనీలో పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్‌ నాగాంజనేయులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య ఇంద్రజ, కుమార్తె ఉన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి..



కలమల్ల-ముద్దనూరు మధ్యలో సుమారు 40 సంవత్సరాలు వయసుగల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెంది వుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే.. 9440627658, 9618828824 సెల్ నెంబర్లకు తెల పాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై రాడ్లతో దాడి... పరిస్థితి విషమం



పులివెందుల టౌన్, సెప్టెంబరు 25: పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో రామాంజనేయులు అనే వ్యక్తిపై ఇద్దరు రాడ్లతో చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా.. వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన రామాంజనేయులుకు పట్టణంలోని రాజారెడ్డి కాలనీ సమీపంలో నివశిస్తున్న లక్ష్మితో వివాహేతర సంబంధం ఉందేమో అనే అనుమానంతో ఆమె కొడుకులు సందీప్, శివనాగేంద్రలు ఘర్షణ పడ్డారు. అక్కడే ఉన్నరాడ్లు తీసుకొని రామాంజనేయులు తలపై బలంగా కొట్టడంతో రోడ్డుపై రామాంజనేయులు రక్తగాయాలతో పడిపోయారు. వెంటనే అక్కడున్నవారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడపరిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

అప్పులబాధతో వ్యక్తి మృతి



సికెదిన్నె, సెప్టెంబరు 25: అప్పుల బాధతో చెన్నంరెడ్డి రామచంద్రారెడ్డి (43) మృతిచెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా.. చింతకొమ్మదిన్నె వాసి రామచంద్రారెడ్డి కడపలో ఓ ప్రైవేటు షోరూంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ జీవించేవాడు. ఇటీవల గ్రామంలో దాదాపు రూ.15లక్షలు అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నాడు. దీంతో భార్య తులసి కూడా ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేదని, ఇద్దరూ సంపాదించినా అప్పు తీరకపోవడంతో కలత చెంది మంగళవారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

పుల్లంపేట, సెప్టెంబరు 25: మండల పరిధిలోని సీతారాంపేట వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మృతి చెందగా.. ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెకు చెందిన శివరాం తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. శివరాం తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్టు

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 25: మండలంలోని గంజాయి స్మగ్లర్లపై బుధవారం పోలీసులు దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. రాజంపేటకు చెందిన పిండిపోయిన కార్తీక, కోడూరు పట్టణానికి చెందిన షేక్ మస్తాన్ పట్టణంలోని చిట్వేలి బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కేజీల గంజాయి, రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హేమ సుందరరావు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

లంకమల అభయారణ్యంలో కూంబింగ్



సిద్దవటం, సెప్టెంబరు 25: లంకమల అభయారణ్యంలోని గొల్లపల్లి సెక్షన్‌లోని సమస్యాత్మక ప్రదేశాల్లో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు ఆధ్వర్యంలో బుధవారం ఎర్రచందనం స్మగ్లర్ల ఆచూకీ కోసం కూంబింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ రేంజర్ మాట్లాడుతూ సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్ మరికొన్ని రోజులు కొనసాగుతుందని.. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. చెక్‌పోస్టుల వద్ద కూడా తనిఖీలు జరుగుతున్నా యని తెలిపారు. ఈ కూంబింగ్‌లో రోళ్లబోడు ఎఫ్‌బీవో బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నిండు కుండల్లా.. జలాశయాలు

గండికోట, మైలవరం నుంచి భారీగా నీటి విడుదల ● పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ● అధికారుల హెచ్చరికలు

కొండాపురం/మైలవరం, సెప్టెంబరు 25: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైతట్టు ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి నీరు చేరుతుండడంతో గండికోట, మైలవరం ప్రాజెక్టులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరగడంతో దిగువనున్న రిజర్వాయర్లు, నదుల్లోకి పెద్ద ఎత్తున నీటిని విడుదల చేస్తున్నారు. కాగా గండికోట ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే మైలవరం జలాశయం నీటి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వివరాలిలా..

గండికోట ప్రాజెక్టు నుంచి 10వేల క్యూసెక్కులు..

గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి బుధవారం సాయింత్రం నుంచి నీటి విడుదలను పెంపుదల చేశారు. 2500 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండగా దానిని 10000 క్యూసెక్కులకు పెంచినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా వచ్చే ఇన్‌ఫ్లో 10,000కు పెరగడంతో, గండికోట నుంచి మైలవరానికి నీటిని పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయిర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.




పూర్తి స్థాయి సామర్థ్యానికి నీరు చేరడంతో కళకళలాడుతున్న గండికోట జలాశయం



ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం



మైలవరం జలాశయంలో జలకళ



పెన్నా నదికి నీరు విడుదల

మైలవరం నుంచి 12 వేల క్యూసెక్కులు..

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఈఈ రమేష్ తెలిపారు. బుధవారం గండికోట జలాశయం నుంచి 10వేల క్యూసెక్కుల నీటిని మైలవరానికి విడుదల చేస్తుండ టంతో.. మైలవరం నుంచి 4గేట్లు ఎత్తి పెన్నానదికి 12వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని తెలిపారు. ఉత్తర కాలువకు 50 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 180 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోట జలాశ యం నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో మరింత పెరిగితే పెన్నానదికి వదులు తామని.. పెన్నాపరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో ప్రజలు భాగస్వామ్యం కావాలి

● కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: స్వర్ణాంధ్ర విజన్‌లో ప్రజలందరూ భాగస్వాములై అమూల్యమైన అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. బుధవారం కడప నగరం ఉక్కాయపల్లె ప్లాజా వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 వార్డుసభలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వందరోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపడుతోందన్నారు. ప్రజలందరూ జిల్లా అర్థికాభివృద్ధికి అమూల్యమైన సలహాలు, సూచనలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలపాలని సూచించారు. 2047నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047తో సంక్షేమ అభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడే విధంగా రూపకల్పన చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో వాగులు, వంకలు చెరువులు డ్రైనేజీలపై ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్మిస్తే వాటిని వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హౌసింగ్ పథకం కొనసాగుతుందని మార్చి 2025 లోపు స్థలం పొందిన ప్రతి ఒక్కరూ గృహాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 40వ డివిజన్‌లో డ్రైన్లు సరిగా లేవని, అందుకు రూ.27 లక్షలు మంజూరు చేయాలని కోరగా 15రోజుల్లో పనులు చేపట్టి త్వరగా పూర్తిచేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



మహిళాప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న వాహనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

2న ఆదరణ పరికరాలు పంపిణీ

టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ కింద మంజూరైన పరకరాలను అక్టోబరు 2న లబ్ధిదారులకు అందిస్తామని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. బుధవారం మహిళా ప్రాంగణంలో నిరుపయోగంగా నిల్వ చేసిన కుట్టుమిషన్లను, స్కిల్ మిషనరీ యంత్రాలను, గార్బేజ్ ఆటోలు, బైండింగ్ మిషన్లను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ కింద ఈ మిషనరీలు మంజూరయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీటన్నింటినీ పక్కనబెట్టి మహిళా ప్రాంగణలో నిరుపయోగంగా ఉంచారని తెలిపారు. వీటన్నింటినీ అందుబాటులోకి తెచ్చి అక్టోబరు 2న గాంధి జయంతి రోజున లబ్దిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వైవో నందన్, అడిషనల్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ఠంగా ఉచిత ఇసుక సరఫరా

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు పారదర్శక విధానంతో జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్





లబ్ధిదారులకు అందజేయకుండా మూలన పడేసిన వాహనాలు, కుట్టుమిషన్లు

రాష్ట్ర గనులు, భూగర్భశాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు వివరించారు. బుధవారం విజయవాడ నుంచి గనులు భూగర్భశాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర కార్యదర్శి జిల్లాల్లో అమలవుతున్న ఉచిత ఇసుక సరఫరా అంశంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయాలను, జిల్లాలో పాటించాల్సిన చర్యలను ఆయన వివరించారు. రాష్ట్రస్థాయిలో ఇసుక రవాణాలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు, బుకింగ్ అనంతరం సరఫరా కావాల్సిన ఇసుక పంపకాలు, పెసిలిటేషన్ కేంద్రాల్లో గుర్తించిన, గమనించిన కీలక సమస్యలు, ఐఆర్ఎస్ రిపోర్టు, జీఎస్టీ తదితర అంశాలపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ, రవాణాదారుల మధ్య సేవాస్థాయి ఒప్పందం అంశం, రవాణా దారుల పనితీరు తప్పనిసరి చెల్లింపుల్లో వినహాయింపులు గూర్చి వివరించారు. రవాణా ఖర్చుల్లో భాగంగా 0-10 కి.మీల లోపు, 10 కి.మీల పరిధిలో 20 మెట్రిక్ టన్నుల ఇసుక ట్రక్కులకు చెల్లించాల్సిన నిర్ధారిత రేటు, 80 కిలో మీటర్ల పరిధిలో టన్నుల పరిమాణం, కిలో మీటర్ల ప్రకారం రేట్లు చెల్లింపు తదితరాలపై వివరించారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇసుక రాయల్టీ అధికారి విమలమ్మ, రవాణా ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక స్పృహ మనతోనే ప్రారంభం కావాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: పర్యాటకం పట్ల స్పృహ మన తోనే ప్రారంభం కావాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముందస్తు వేడుకల్లో భాగంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ఫొటోల ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలు సందర్శించేందుకు మనం తొలి ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, పద్మ ప్రియ చంద్రారెడ్డి, జి.వెంకటేశ్వర్ రావు, శ్రీనివాసులు, రామలింగారెడ్డి, డేవిడ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండికోటపై పదివేల పుస్తకాలు పంపిణీ

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న గండికోటలో ఇంటాక్ 'మన గండికోట' పేరిట రూపొందించిన పదివేల పాకెట్ పుస్తకాలను పంపిణీ చేయనుంది. ఇంటాక్ సంస్థ జిల్లా చాప్టరు కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి ఉత్సవాలకు హాజరుకానున్న ప్రజలకు గండికోట గురించి క్లుప్తంగా సమాచారం అందించేందుకు 34 పేజీల మినీ బుక్ రూపొందించనున్నారు. 18 ఫొటోలున్న ఈ పుస్తకంలో గండికోటలోని ప్రముఖ ప్రాంతాలు, చారిత్రక నిర్మాణాల గురించి ప్రాథమిక సమాచారం అందించనున్నారు.

జేబీ హాస్పిటల్‌లో రోబో ద్వారా క్లిష్టమైన సర్జరీ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 25: పేషంటు ఓబులమ్మకు రెండు కాళ్లు బాగా అరిగిపోయి.. తీవ్రంగా వంకర పోయి పలు హాస్పిటల్స్‌లో తిరిగారు. అన్ని హాస్పిటల్స్‌లో ఆమె మోకాలు ఎక్కువ అరిగిపోయి ఎక్కువ వంకర పోవడంతో హింజెడ్‌లేదా కన్‌స్ట్రెండ్ మోకాలు మార్పిడి చేయాలని తెలిపారు. దీనికి చాలా ఖర్చు అవుతుందని తెలిపారు. వారు అంత ఖర్చు చేయలేమని.. అన్ని చోట్లా తిరగలేక కడపలోని జేబీ హాస్పిటల్‌కు రాగా డాక్టరు జహంగీర్‌బాషా ఆమెను పరీక్షించి రోబోద్వారా ఈ ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా చేయగలుగుతామని పేషంటుకు ధైర్యం చెప్పి.. రోబో ద్వారా ఆపరేషన్ చేసి పేషంటును మరుసటి రోజు నడిపించారు. ఈరోబో ద్వారా వంకర కలిగిన మోకాళ్లకు ఆపరేషన్లు అతిసులభంగా.. తక్కువ సమయంలో అతి తక్కువ రక్తస్రావం, కచ్చితత్వంతో చేగలమని డాక్టర్ తెలిపారు.

ఓబులమ్మ ఆపరేషన్ తరువాత ఇంత సులభంగా నడవగలుగుతానని అనుకోలేదని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ తమ వద్ద రోబో ఆపరేషన్లు అతి తక్కువ ధరకు చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



సర్జరీ చేయించుకున్న ఓబుళమ్మతో డాక్టర్ జహంగీర్ బాషా, జేబీ హాస్పిటల్ సిబ్బంది తదితరులు

ట్రిపుల్‌ఐటీ అకడమిక్ డీన్‌గా కైలాష్



రమేష్‌కైలాష్‌ను సత్కరిస్తున్న అసిస్టెంట్‌ప్రొఫెసర్లు

వేంపల్లె, సెప్టెంబరు 25: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అకడమిక్ డీన్‌గా సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రమేష్ కైలాష్‌ను డైరెక్టర్ గుప్త నియమించారు. డీన్ రత్నకుమారి స్థానంలో ఆయన్ను నియమించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంక టేష్‌ను నియమించారు. గతంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా ఉన్న ఇమ్రాన్ స్థానంలో ఆయన్ను నియమించారు. కొత్తగా నియమించిన ఇద్దరిని ఏఓ రవికుమార్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి తదితరులు సత్కరించారు.

వంట నూనెను తిరిగి వాడడం మానుకోండి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: నూనెరహిత సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల జీవన ప్రమాణ రేటు పెంచుకోవచ్చని వైస్‌ఛాన్సలర్ ప్రొఫె సరు క్రిష్ణారెడ్డి తెలిపారు. బువారం వైవీయూలో డిపార్ట్‌మెంటు ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ రీపర్పస్ యూజ్డ్ కుకింగ్ ఆయిల్ స్టార్ గ్లోబల్ ఏజెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో వంటనూనెను తిరిగి వాడడం మానుకోండి, మీ తలరాతను కాపాడుకోండిపై అవగాహన నిర్వహించారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ రామక్రిష్ణ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ సహాయాచార్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిర్మలగిరి కాలనీని పరిశీలించిన వైద్య బృందం



వివరాలు సేకరిస్తున్న జిల్లా వైద్యాధికారులు

సిద్దవటం, సెప్టెంబరు 25: మండలంలోని బొగ్గుడివారిపల్లె గ్రామ పంచాయతీ నిర్మలగిరి కాలనీలో మంగళవారం ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో ఆ ప్రాంతాన్ని కడప డీఎంహెచ్‌వో నాగరాజు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ, అడిషనల్ డీఎంహెచ్‌వో ఉమామహేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఇద్దరు చిన్నారుల మృతిపై చుట్టుపక్కల ప్రాంతాల వారిని విచారించి వివరాలు సేకరించామని, ఇక్కడ ఎవ రికి ఎటువంటి జ్వరాలు లేవని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత లేకుండా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని, ముఖ్యంగా నీరు నిల్వలేకుండా చూసుకోవాలని ప్రజలకు తెలియజేశారు. ఇద్దరు చిన్నారులు మృతిపై పూర్తి వివరాలు సేకరించామని, వారి ఆరోగ్య సమస్య లక్షణాలు, జ్వరం వల్ల మృతి చెందలేదని తెలియజేశారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారని, అందరూ ఆరోగ్యంగా ఉన్నారని, ఏదైన సమస్య ఉంటే సమీప ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు వెళ్లి వైద్యులతో సంప్ర దించాలని తెలియజేశారు. మృతిచెందిన చిన్నారుల గుడారం చుట్టూ, పరవీధుల్లో అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పిచికారి చేశారు. కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలి

కలెక్టరు శివశంకర్, ఎమ్మెల్యే మాధవి



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, చిత్రంలో కలెక్టర్ శివశంకర్, టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: స్వచ్ఛతా హి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కడప నగరాన్ని క్లీన్ అండ్‌గ్రీన్ నగరంగా తీర్చిదిద్దాలని కలెక్టరు శివశంకర్, కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో కడప ఐటీఐ సర్కిల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి స్వచ్ఛతా హి సేవా సైకిలు ర్యాలీ నిర్వహించారు. కడప ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టరు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు సెప్టెంబరు 17 నుంచి 1వతేదీ వరకు స్వచ్ఛతా హి సేవ చేసుకుంటున్నామన్నారు. అక్టోబరు 2న స్వచ్ఛతా హి సేవ ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రోజూ ఒక అంశంపై జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించు కుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. ఎమ్మెల్యే, కార్పొరేషన్ కమిషనరు ఆధ్వర్యంలో సైకిలు ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు కార్పొరేషన్ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్

పులివెందుల టౌన్, సెప్టెంబరు 25: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజరు శ్రీనివాస ప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా బుధవారం స్థానిక వైవీఎంఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటిన ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు సిద్ధిస్తాయన్నారు. ఏపీజీబీ బ్రాంచ్ కార్యాలయంలో ఇద్దరు పారిశుధ్య మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట గణేశ్, సీనియర్ మేనేజరు రాజేశ్ (మెయిన్‌బ్రాంచ్) అసిస్టెంట్ మేనేజర్లు ప్రసాద్, కిరణ్‌కుమార్, ఉమామహేశ్వరి, రోహిణి కుమారి, ఫీల్డ్ ఆఫీసర్లు కిశోర్‌కుమార్ రెడ్డి, క్యాషియర్లు జ్యోతి, వెంకటచలపతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంతో ఆరోగ్యకర వాతావరణం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 25: పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ రాముడు ప్రజలకు సూచించారు. బుధవారం పట్టణంలోని నగరిగుట్ట, వారపు సంత మార్కెట్‌లలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వాలన్నారు.

30న కడప ఉక్కు కోసం ధర్నా

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 25: సోమవారం కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టే కడప ఉక్కు పరిశ్రమ కోసం ధర్నా విజయవంతం చేయాలని అఖిల పక్షం నేతలు నారాయణరెడ్డి, సీఆర్వీ ప్రసాద్, గురప్ప,జయవర్ధన్, సుబ్బరాయుడు, ఓబులేసు పిలుపు నిచ్చారు. నిరుద్యోగ యువత ప్రజలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బుధవారం నాగరాజుపేటలోని కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాయలసీమ ప్రాంత ప్రజలు, రైతులు, సాగు తాగునీటిని పెండింగులో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రాయలసీమ ప్రజలకు అన్యాయం చేయవద్దు

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 25: అరకొరగా బతుకుతున్న రాయలసీమ ప్రజలను నిలువెల్లా ఎండకట్టడం తగదని కడప కొప్పర్తిలోని ఎంఐసీని అమరావతికి తరలించడం శ్రీశైలంలో నీటి మట్టాన్ని మినిమం బ్యాలెన్స్ వరకు నిల్వచేయాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకరరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కడప నగరంలో ఎన్‌సీఏపీ బృందం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: కడప నగరంలో వాయువు నాణ్యత మెరుగు పరచడం, పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకునే ందుకు ఎన్‌సీఏపీ బందం పర్యటించింది. నగరంలో తీసుకుంటున్న కాలుష్య నియంత్రణ చర్యలు, వాయునాణ్యత మెరుగుదలకు తీసుకోవాల్సిన ప్రణాళికలను బృందం సమీక్షించింది. కమిషనరు ఛాంబరులో సమావేశం నిర్వహించారు.

రైతులు అధికారుల సలహాలు పాటించాలి

సికెదిన్నె, సెప్టెంబరు 25: రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏఓ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. బుసిరెడ్డిపల్లె, బాలుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. పత్తిపంటను పరిశీలించిన ఆయన రైతులకు జాగ్రత్తలు సూచించారు.

హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె, సెప్టెంబరు 25: హెచ్ఐవీ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సురేష్‌రెడ్డి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ మేనేజర్ వల్లి తెలిపారు. వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి, స్థానికులకు హెచ్ఐవీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, నాయక్, మూర్తి సుభాషిణి, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం

● అర్హులకు సంక్షేమం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు

సంక్షేమం-అభివృద్ధి చంద్రబాబుకు రెండు కళ్లు ● ఇది మంచి ప్రభుత్వంలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి





ఇది మంచి ప్రభుత్వం పులివెందుల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి - పెండ్లిమర్రి సభలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 25: ఇది ప్రజా ప్రభుత్వమని అందరికీ సమన్యాయం జరుగుతుంది, పార్టీలకతీతంగా సంక్షేమ పాలన ఉంటుందని, ఇది మంచి ప్రభుత్వంగా ప్రజలు గుర్తింపునిచ్చారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లపురెడ్డిపల్లెలో 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకెళ్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో పింఛన్లు, డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడం, నిధులు తెప్పించడం తదితర పథకాలు, అభివృద్ధి చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుబడులు ఆహ్వానించి పరిశ్రమలు నెలకొల్పేందుకు కృషిచేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించి రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు చీరెలు, పండ్లు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఎంపీపీ వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ వెంకటేశ్, సీడీపీఓ శ్రీలత, ఏపీఎం గురురాజ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పట్ల వినతుల వెల్లువ

గ్రామసభకు హాజరైన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి ప్రజలు సమస్యలు విన్నవించారు. రేషన్ పంపిణీ, తాగు నీరు, పైప్‌లైన్లు, యర్రబల్లె చెరువుకునీళ్లు, మురుగునీరు, వీధిలైట్ల సమస్యలను విన్నవించారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు వస్తాయన్నారు.

పెండ్లిమర్రి సభలో ఎమ్మెల్యే పుత్తా చైతన్య

పెండ్లిమర్రి, సెప్టెంబరు 25: సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి అన్నారు. మండలంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం, పొలం పిలుస్తోంది సభల్లో ఆయన మాట్లాడుతూ కొప్పర్తి ఇండస్ట్రీ కారిడార్ అభివృద్ధికి చంద్రబాబు సహకారంతో కేంద్రం రూ.2150కోట్లు కేటాయించడం జిల్లా అభివృద్ధికి పునాదన్నారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ప్రతి గ్రామానికీ కావాల్సిన అవసరాలను ప్రజల నుంచే సర్వే ద్వారా తెలుసుకుని, ఆ ఊరిని అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ జగన్‌మోహన్, ఏఓ ఓబులేసు, అధికారులు, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, రంపతాడు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో....

సింహాద్రిపురం, సెప్టెంబరు 25: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా చంద్రబాబు నాయుడు పాలన సాగించడం సంతోషించదగ్గ విషయమని టీడీపీ మండల ఇన్‌చార్జ్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. కసనూరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వంలో టీడీపీ నేతలు, అధికారులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలును వివరించారు. మారెడ్డి జోగిరెడ్డి, సర్పంచ్ రవణమ్మ, మండల ప్రత్యేక అధికారి సన్నన్న, ఎంపీడీఓ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో...

కమలాపురం రూరల్, సెప్టెంబరు 25: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్య ఉద్దేశమని మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు టీడీపీ నేతలు రవీంద్రారెడ్డి, చిన్ని తెలిపారు. పెద్దచెప్పలిలో ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. ఎంఈఓ సుభాషిణి, సచివాలయ సెక్రటరీలు స్వర్ణలత, వెటర్నరీ డాక్టరు శివ జ్యోతి, టీడీపీ నేతలు ఖలీఫ్‌ఖాన్, సుధాకర్, రమణయ్య, జయచంద్ర శేషాద్రి పాల్గొన్నారు.

వేములలో....

వేముల, సెప్టెంబరు 25: అర్హులందరికి ప్రభుత్వ పథకాలను అందిస్తామని టీడీపీరాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. వేముల, గొందిపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. ఎంపీడీఓ, మండల స్పెషలాఫీసర్, తహసీల్దార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వర్షపునీటిలో కడప ఆర్టీసీ బస్టాండు

ఇక్కట్లపాలవుతున్న ప్రయాణీకులు ● అక్కడక్కడా పెచ్చులూడుతున్న బస్టాండ్ భవన సముదాయం





వర్షపునీటిలో బస్సులు - అధికారులతో సమీక్షిస్తున్న కమిషనరు వైవోనందన్

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 25: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో, బస్టాండు వర్షం నీటిలో మునిగింది. కడప రీజియన్ పరిధిలోని ఇతర (మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల) డిపోల కన్నా కడప ఎక్కువ ఆదాయం వచ్చే డిపోగా కూడా ముందంజలో వుంది. నిత్యం ఇక్కడి నుంచి కడప డిపో బస్సులతో పాటుగా ఇతర డిపోల నుంచి, పక్క రాష్ట్రాల (తెలంగాణ-కర్ణాటక- తమిళనాడు) బస్సులు ని త్యం వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. వాటిల్లో వేలాది మంది ప్రయాణీకులు ప్రయాణిస్తుంటారు. బస్టాండ్ భవన సముదాయ భవనంలో గల అద్దె గదుల్లో కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిల్స్, టిఫిన్, భోజనం, కాఫీ, సెల్‌ఫోన్స్, బిరియానీ, బేకరీ, తదితర దుకాణాలున్నాయి. ఆయా గదుల్లో అమ్మే వాటిని బట్టి ఒక్కో రూముకు ఒక్కోరేటు అద్దెగా గుంజుతున్నట్లు సమాచారం. అలా అద్దెల పేరుతో వేలాది రూపాయల వసూళ్ళు చేస్తున్నా ఆయా రూముల పర్యవేక్షణ విషయంలో డిపో అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలున్నాయి.

వర్షం వస్తే నరకయాతనే

చిన్న పాటి వర్షం కురిసిందంటే చాలు కడప బస్టాండ్ జలమయం కావడం పరిపాటిగా మారింది. బస్టాండ్ నలువైపులా వర్షపునీటితో చిన్నపాటి నీటి కుంటను తలపిస్తోంది. పాలకులు మారుతున్నారే గానీ బస్టాండు దుస్థితి మారడం లేదు. ప్రయాణీకులు బస్టాండుకు రావాలంటే నరకయాతనకు గురికావాల్సి వస్తోంది. వర్షపు నీటిలోనే బస్సులు ఆగుతాయి.

నిలిచిన నీటిని తొలగించాలి - కమిషనరు వైవో నందన్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: ఆర్టీసీ బస్టాం డు పరిధిలో నిలిచిన నీటిని త్వరితగతిన తొలగించాలని మున్సిపల్ కమిషనరు వైవో నందన్ తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కమిషనరు ఛాంబరులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కడప నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది జరగకుండా తక్షణం తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటరమణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పోతురాజు, మున్సిపల్ డీఈ వేణు గోపాల్, ఏఈ భవానీకుమార్ పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

కడప క్రైం సెప్టెంబరు 25: రిమ్స్ రహదారిపై బైకుతో విన్యాసాలు చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఇటీవల కలెక్టరెట్ నుంచి రిమ్స్‌కు వెళ్లే దారిలో యువకులు బైకులతో అతివేగంగా విన్యాసాలు చేస్తు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వీడియోలు పరిశీలించి యువకులను గుర్తించి వాహనాలు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యువకుల కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

తిరుమల లడ్డూ అపవిత్రంపై ర్యాలీ

సికెదిన్నె, సెప్టెంబరు 25: తిరుమల లడ్డూ అపవిత్రపై హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నెలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. శివాలయం ఛైర్మన్ శంకర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ నేత బాలకృష్ణుడు మాట్లాడుతూ టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఈఓ ధర్మారెడ్డిని కఠినంగా శిక్షించాలని ర్యాలీ నిర్వహించి ఆలయాల్లో సంప్రోక్షణ చేశారు. రసూల్‌పల్లి మాజీ సర్పంచ్ ఖలందర్‌రాజా, టీడీపీ నేతలు సుబ్బారెడ్డి, చైతన్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సబ్‌రిజిస్ట్రారు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 25: కమలాపురం సబ్ రిజిస్ట్రారుగా డీఎం బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ముద్దనూరు సబ్ రిజిస్ట్రారుగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కమలాపురం సబ్ రిజిస్ట్రారుగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్‌బాషా మైదుకూరు సబ్‌రిజిస్ట్రారుగా బదిలీపై వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

చంద్రబాబును కలిసిన పిచ్చయ్యచౌదరి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఇటీవల తన రచన పర్యాటక పుస్తకాన్ని సీఎం చంద్రబాబుకు అలపర్తి పిచ్చయ్య చౌదరి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు తాను చేసిన ఇంటర్‌విద్యలో అకడమిక్ ఆర్గనైజరు పుస్తకాన్ని అందించి కొన్ని మార్పులతో ఇంటర్ విద్యార్థులకు ఉపయుక్తంగా అందించాలని కోరారు.

ఉపాధ్యాయ క్రీడలకు మంత్రికి ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధ్యాయ క్రీడల ప్రారంభానికి మంత్రి మండిపల్లిని ఆహ్వానించారు. అక్టోబరు 4, 5, 6 తేదీల్లో జరిగే ఉపాధ్యాయ క్రీడల ప్రారంభానికి మంత్రి రావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు ఆహ్వానించారు.

'జిల్లాపై సవతి తల్లి ప్రేమ'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: ముఖ్యమంత్రి చంద్రబాబు కడప జిల్లాపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో టీడీపీకి సీట్లు రాలేదని అభివృద్ధికి దూరం చేశారని ప్రస్తుతం టీడీపీకి సీట్లు వచ్చినా జిల్లాపై సవతితల్లి ప్రేమ చూపుతున్నారన్నారు.

మార్కుల నమోదు సరళీకృతం చేయాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: సెల్ఫ్ అసెస్‌మెంటు మార్కులను స్కూలు అటెండెన్స్‌యాప్ ఆన్‌లైన్ నమోదు సౌకర్యాలను సరిచేసి సరళీకృతం చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ ప్రకనటలో కోరారు. సబ్జెక్టు ఉపాధ్యాయుల లాగిన్‌లో స్వీయ బోధనా తరగతుల విద్యార్థులందరి జాబితా కనబడేలా చూడాలన్నారు. పొరపాట్లను సరి చేసేందుకు ప్రతి అంశానికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు

నిలబడి ఉన్న లారీని ఢీ కొన్న మరో లారీ



డ్రైవరును బయటికి తీస్తున్న దృశ్యం

చెన్నూరు, సెప్టెంబరు 25: రాజంపేట బైపాస్‌రోడ్డులో పాలెంపల్లె వద్ద బుధవారం తెల్లవారు జామున రోడ్డుపై నిలిచి ఉన్న లారీని తిరుపతి వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో లారీ డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వ డంతో వారు వెంటనే 3గంటలకు వచ్చి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరును బయటికి తీసి కడప రిమ్స్‌కు తరలించారు. 108 డ్రైవర్లు కె.నారాయణ, ఉమామహేశ్వర్, సిబ్బంది సుబ్బరాయుడు, విజయభాస్కర్ శ్రమించారు.

అడవిపంది మాంసం పట్టివేత

ముగ్గురు అరెస్టు

వేంపల్లె, సెప్టెంబరు 25: వేంపల్లె అటవీశాఖ రేంజ్ పరిధిలోని అలిరెడ్డిపల్లె పంచాయతీ తువ్వపల్లెలో మూడున్నర కిలోల అడవిపంది మాంసంను పట్టుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. అందిన సమాచారంతో తనిఖీ చేపట్టగా తువ్వపల్లెలో గొందిపల్లె వెంకటపతి, గొందిపల్లె నడిపి మునెయ్య, తాళ్లపల్లె మునెయ్య వద్ద మాంసం స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. చిలేకాంపల్లె సిద్దారెడ్డి పొలంలో కరెంటుతీగలు పెట్టగా అడవిపంది కరెంటు షాక్‌కు గురై చనిపోయింది. ఆ మాంసాన్ని వీరికి ఇచ్చిన సిద్దారెడ్డి కోసం గాలిస్తున్నట్లు రేంజర్ తెలిపారు. కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

వల్లూరు, సెప్టెంబరు 25: గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి క్రిష్ణకిశోర్ ఎంపీడీఓ జయశ్రీ అన్నారు. ఎంపీడీఓ సభా భవనంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బేస్‌మెంట్‌లు వేసి పిల్లర్లతో ఉన్న తదితర వాటిని గుర్తించి పూర్తి చేయించాలన్నారు. హౌసింగ్ ఏఈ స్వచ్ఛభారత్ ఎన్‌సీఓ, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ 6 హామీల అమలులో విఫలం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో తులసిరెడ్డి, విజయజ్యోతి



నిరసన తెలుపుతున్న తులసిరెడ్డి, విజయజ్యోతి, అఫ్జల్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 25: చంద్రబాబు పాలనలో సూపర్ 6 హామీలు అమలులో విఫలమైందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ జ్యోతి విమర్శించారు. బుధవారం పీసీసీ కమిటీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 'థాలీ బజావో' అంటూ స్టీలు పళ్లెం వాయిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్ 6 హామీల అమలు జరగడంలేదని కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు తెలిపిన నిరసనలో వారు మాట్లాడుతూ జగన్ పాలనలో అప్పులు ఫుల్ - అభివృద్ధి నిల్ అన్నారు. సంక్షోభంలో సంక్షేమం అంటూ పాలన సాగించారని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మాఫియా రాజ్యం చేసిందన్నారు. అప్పులు, అరాచకాలు, అవినీతి, డ్రగ్స్, గంజాయి, అంధ్ర ప్రదేశ్‌గా మార్చిందని, అందుకే ఎన్నికల్లో జగన్ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించారన్నారు. చంద్రబాబు సూపర్ 6 హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. యువతకు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, రైతులకు, మహిళలకు ఉచిత బస్సు, ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు, 19-5 ఏళ్ల మహిళలకు రూ. 1500 ఆర్థిక సాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుమంత్‌కుమార్, నేతలు బండి జకరయ్య, సుశీల్ కుమార్, మధురెడ్డి, ధ్రువ కుమార్ రెడ్డి, పుల్లయ్య, శ్యామలమ్మ, ప్రసాద్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నేత సుబ్బారెడ్డి, సయ్యద్ సలాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర కార్మికులకు కౌన్సెలింగ్

పులివెందుల టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ ఆదేశాల మేరకు పోలీసులు నివారణ చర్యలు చేపట్టారు. బుధవారం అంతరాష్ట్ర నుంచి పులివెందులకు పనులకు వచ్చిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన పది మందిని, చత్తీస్‌గఢ్‌కి చెందిన 21, మధ్యప్రదేశ్‌కు చెందిన 25, ఉత్తరప్రదేశ్, ఒడిస్సాలకు చెందిన ఐదుగురు సహా మొత్తం 64 మందిని స్టేషన్‌కు పిలిపించి అర్బన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు కౌన్సెలింగ్ ఇచ్చి వారి వివరాలు, వేలి ముద్రలను నమోదు చేశారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్

కడప క్రైం సెప్టెంబరు24: సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చని, మహిళలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఏఆర్ ఏఎస్పీ కృష్ణారావు అన్నారు. ఉమేష్‌చంద్ర కల్యాణ మండపంలో విజయవాడ మణిపాల్ ఆస్పత్రి సహకారంతో ఉచిత బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను బుధవారం కొనసాగించారు. మణిపాల్ ఆస్పత్రి రేడియేషనల్ ఆంకాలజిస్ట్ స్పెషలిస్ట్ వైద్యురాలు శ్రీదివ్య, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, పోలీస్ సంక్షేమ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలంరెడ్డి, మణిపాల్ ఆస్పత్రి కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

జింకులోపాలు నివారించుకోండి

చెన్నూరు, సెప్టెంబరు 25: వరి పొలాల్లో చౌడు ఉండడం వల్ల జింకు లోపం వచ్చే అవకాశం ఉందని కావున జింక్‌సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి తీసుకుని పిచికారీ చేసుకోవాలని ఏడీఏ రమణారెడ్డి తెలిపారు. గుర్రంపాడు, నజీర్‌బేగ్‌పల్లె గ్రామాల్లో బుధవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరిలో పాముపొడ, తెగులు ఉందని, దానిని నివారించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి శ్రీదేవి మాట్లాడుతూ వరి నాటిన 45 రోజుల్లోపు సామూహికంగా పొలం గట్టు శుభ్రం చేసుకుంటే కలుపు నివారించుకోవచ్చన్నారు.

వర్షానికి నేలకొరిగిన వరిపంట



వల్లూరు, సెప్టెంబరు 25: పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున నుంచి కురిసిన భారీవర్షం, తీవ్ర గాలులు వీయడంతో వరి పంట పూర్తిగా నేలకొరిగింది. పెద్దపుత్త, దుగ్గాయపల్లె, తప్పెట్ల తదితర గ్రామాల పరిధిలో నీటి వసతి ఉన్న రైతులు ఖరీఫ్‌లో ముందస్తుగా సాగు చేసిన వరిపంట కోత దశ ఉంది. ఒకటి రెండు రోజుల్లో కోత కోయడానికి సిద్ధమవుతున్న తరుణంలో భారీ వర్షం, గాలులు వీయడంతో పంట మొత్తం నేలకొరిగింది. పొలాల్లో నీరు నిలిచిన కారణంగా మరికొన్ని రోజులు వరికోయడానికి వీలు కాని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాగే వర్షాలు కురిస్తే ప్రస్తుతం నేలకొరిగిన వరిపంట ధాన్యం మొలకెత్తే అవకాశాలున్నాయని, తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొలం పిలుస్తోంది సద్వినియోగం చేసుకోవాలి : ఏడీఏ

సింహాద్రిపురం, సెప్టెంబరు 25: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముద్దనూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. పైడిపాళెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది అనంతరం రైతులకు నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు కావలసిన సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు సేంద్రియ వ్యవసాయం విధానం అలవర్చుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా కృషి చేయాలని రైతులకు ఏడీఏ సూచించారు.

మున్సిపాలిటీలో బదిలీలు

ప్రొద్దుటూరు సెప్టెంబరు 25 : సాధారణ బదిలీల్లో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఇక్కడి పనిచేస్తున్న డీఈ వెంకటరమణ చిత్తూరుకు బదిలీ అయ్యారు. పబ్లిక్ హెల్త్ డీఈగా కడప నుంచి యశోద ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి డీఈగా రానున్నారు.ఏఈలు దస్తగిరి రెడ్డి ఆళ్లగడ్డకు బదిలీ కాగా ఉమామహేశ్వరి జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. కడప కార్పొరేషన్ నుంచి ఎన్ దిల్‌షాద్, ఆళ్లగడ్డ నుంచి సురేంద్రనాథరెడ్డి ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఏ ఈలుగా రానున్నారు.

రెవెన్యూ శాఖలో : రెవెన్యూ శాఖలో ఎన్‌ఫోర్స్ మెంట్ డిప్యూటీ తహసీల్దారుగా మల్లికార్జున మైదుకూరు నుంచి ప్రొద్దుటూరుకు బదిలీ పై రానున్నారు.ప్రొద్దుటూరు రిసర్వే డిటీగా వున్న సతీష్‌కు రాజుపాళెం రీసర్వే డిటీ వుంటూ ప్రొద్దుటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీగా డిప్యూటేషన్ పైవున్న సుదర్శన్‌ను ఖాజీ పేటకు బదిలీ చేశారు. డిప్యూటేషన్‌పై ప్రొద్దుటూరు రిసర్వేడిటీ గా సుదర్శన్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఇక్కడ వుండే ఆర్ఐ నాగమోహన్‌రెడ్డిని కడపకు బదిలీ చేయగా తిరిగి ప్రొద్దుటూరు కే డిప్యూటేషన్‌పై ఆర్డర్ ఇచ్చారు. ఇక్కడ వుండే జూనియర్ అసిస్టెంట్లు జాఫర్ బాషాను జమ్మలమడుగుకు, సుజయ్ ఆదర్శ కుమార్‌ను పులివెందుల ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. ముద్దనూరు నుంచి జనార్దన్, కొండాపురం నుంచి వెంకసుబ్బయ్యను ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయానికి బదిలీ చేశారు.

తహసీల్దారు కార్యాలయ సిబ్బంది బదిలీ

కాశినాయన సెప్టెంబరు25: నర్సాపురం తహసీల్దారు కార్యాలయం లో సిబ్బంది పూర్తిస్థాయిలో బదిలీ అయ్యారు. తహసీల్దారు బాల నరసింహులును పెద్దముడియం మండలానికి,డీటీ విజయలక్ష్మిని బద్వేల్ ఆర్డీవో కార్యాలయంలో ఎలక్షన్ డీటీగా, రీసర్వే డీటీ సత్యాను గోపవరం మండలానికి, ఆర్ఐ దక్షణామూర్తి కడప ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా,జూనియర్ అసిస్టెంట్ వైష్ణవిని కలసపాడు మండలానికి,టైపిస్ట్ రవి బ్రహ్మంగారి మఠం మండలానికి బదిలీ చేశారు.

అర్హతలున్నా చైర్మన్ కాకుండా మెంబర్ ఇవ్వడం అవమానించినట్లే

చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య లేఖ

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 25 : అన్ని రకాల అర్హతలున్నా బీసీ గాండ్లకులానికి చెందిన తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వకుండా మెంబరుగా ఇవ్వడం బీసీలందరూ అవమానంగా భావిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు డాక్టర్ బచ్చల పుల్లయ్య లేఖ రాశారు. మంగ్లవారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రచర్ డెవలప్ మెంట్ కార్పొరే షన్ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్‌బచ్చలపుల్లయ్యను ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. ఈ పదవి ఇవ్వడంపై చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపుతూ ఆ లేఖలో హైయ్యర్‌క్వాలికేషన్‌తో పాటు 2వేలమంది విద్యార్థులున్న కాలేజీలో లెక్చరర్, ప్రిన్సిపాల్‌గా 30 ఏళ్ళు పనిచే సినట్లు పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్శిటీ పాలకమండలి సభ్యుడిగా, టీచర్స్ ఎమ్మెల్సీగా పనిచేశారని తెలిపారు. టీడీపీ పార్టీ అబ్జర్వర్‌గా కర్నూలు జిల్లా నంద్యాల, నెల్లూరు జిల్లా రాపూరు, అనంతపురం జిల్లా పుట్టపర్తి నియోజకర్గాలలో పనిచేసినట్లు ఆలేఖలో తెలిపారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డివిజయం కోసం కృషి చేసినట్లు వెల్లడించారు. కార్పొరేష్ చైర్మన్ పదవికి అర్హతలున్న తనకు మెంబరుఇవ్వడంపై బీసీసమాజం తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆయన ఆ లేఖలో చంద్రబాబుకు తెలిపారు.

దసరా ఘనంగా నిర్వహిస్తున్నాం...అందరూ సహకరించండి

● ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ గుప్త



దసరా పుస్తకం ఆవిష్కరిస్తున్న సూరిశెట్టి ప్రసాద్ గుప్త

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 25 : మైదుకూరులోని అమ్మవారి శాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తు న్నామని, ఆర్య వైశ్యులు,పట్టణ ప్రజలందరూ సహకరించాలని మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ గుప్త సమావేశంలో తెలిపారు. స్థానిక నంద్యాల రోడ్డులోని అమ్మవారిశాలలో బుధవారం దసరా పుస్తకావిష్కరణ చేశారు. 3వ తేదీన రాజరాజేశ్వరిదేవి అలంకారం,4వ తేదిన గాయత్రిదేవి అలంకారం,5న పార్వతీదేవి ,6న మహాలక్ష్మీదేవి అలం కారం ఉంటుందన్నారు. 7 న అన్నపూర్ణదేవి అలంకారం,8 వతేదీన భువనేశ్వరిదే వి అలంకారం,9 న సరస్వతీ దేవి అలంకారం ఉంటుందన్నారు. అదే విధంగా 10వ తేదీన మహిషాసురమర్ధిని అలంకారం, 11వ తేదిన గజలక్ష్మీదేవి అలంకారం,12న విజయలక్ష్మీదేవి అలంకారం,13న వాసవీ కన్యకా పరమేశ్వరి అలంకారం(వసంతోత్సవం) జరుగుతుందని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమితోనే సాధ్యం



ప్రొద్దుటూరు 20 వవార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జమ్మలమడుగు దేవగుడిలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కలసపాడు చింతలపల్లె గ్రామంలో మాట్లాడుతున్న రితీష్‌రెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 25 : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం 20 వవార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డులో ప్రచారం చేశారు. అనంతరం కోటవీధి గర్ల్స్ హైస్కూల్లో బహిరంగ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి , మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, నాయకులు వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి,టౌన్ బ్యాంకు చైర్మన్ సుబ్బారెడ్డి,కౌన్సిలర్ కమాల్ బాషా, జనసేన ప్రతినిధులు జిలాన్ ,మురళీ వద్ది బాలుడు, బాదుబోయిన సుబ్బారావు, తలారి పుల్లయ్య పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: మంచి చేసే ప్రభుత్వానికి ప్రజల్లో కూడా అన్ని రంగాల్లో మార్పు రావాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి సూచించారు. బుధవారం జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక సమావేశం డీఎల్‌డీవో సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. అనంతరం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రాభివృద్ధికోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ సింగం భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అధికారులు, నాయకులు, మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, పాలకోవ రమేష్‌రెడ్డి, సర్పంచులు మునెమ్మ, తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలో 13, 14 వార్డుల్లో బుధవారం టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు బిర్రు సంతోష్, నాయకులు, కార్యకర్తలు ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు అందించారు.

కలసపాడు..: చంద్రబాబు పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని బద్వేలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బిజివేముల రితీష్‌రెడ్డి, బీజేపీ నేత రోశన్న అన్నారు. బుధవారం మండలంలోని చింతలపల్లె గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బమ్మ, మాజీ మార్కెట్‌యార్డుచైర్మన్ రంతు,ప్రభుత్వ అధికారులు, పోరుమామిళ్ల పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ శేషఫణి తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నగరపంచాయతీలోని రెండోవార్డు వినాయక నగర్‌లో బుధవారం నిర్వహించారు.ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ చంద్రకళ, టీడీపీ నాయకుడు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని మాదాపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మండల టీడీపీ అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి అధికారులు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించారు.మండల టీడీపీ నాయకులు పోతిరెడ్డి రెడ్డప్పరెడ్డి, మాజీ అధ్యక్షుడు మన్యం మహేశ్వర్‌రెడ్డి, పి.వెంకటసుబ్బారెడ్డి, ఎం.మీనాక్షిరెడ్డి, పుల్లారెడ్డి, చెంచురెడ్డి, రాజారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సుజాతమ్మ, ఏపీయం సురేశ్ బాబు, పంచాయతీ సచివాలయ సిబ్బంది,కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: రాష్ట్రంలోని నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వలక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం బి.మఠం మండలంలోని మల్లేపల్లె, ముడుమాల పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంగమునిరెడ్డి, చిలమల నారాయణ, మాజీ ఎంపీటీసీ రమేశ్, మాజీ సర్పంచ్ దారం బాలయ్య, ముడుమాల పోలిరెడ్డి, సాంబశివారెడ్డి , పూజా శివాయాదవ్, ఆదిబోయిన రమణయ్య, సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి, నాగయ్య, సూరి, మస్తాన్, అధికారులు పాల్గొన్నారు.



ఖాజీపేట.. సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

ఖాజీపేట..: మండల పరిధిలోని తవ్వారుపల్లె, పుల్లూరు, త్రిపురవరం పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, సెక్రటరీలు రజాక్, శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భార్గవి, రమాదేవి, శ్రీదేవి, టీడీపీ ఉపాధ్యక్షుడు హబీబ్, చంద్ర ఓబుళరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఫరూక్, గోవిందు సుబ్బయ్య, సత్యనారాయణ, జెండాల మాబాష, గౌస్, సుల్తాన్, కోరా చంద్ర ఓబుళరెడ్డి, ఎంఎస్ సతీహుల్లా, రామానాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి సుబ్బయ్య, వీరయ్య, శంకర్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరం..: మండలంలోని రాచాయిపేట గ్రామ పంచాయతీలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం ఎంపీడీవో ఈవోపీఆర్‌డీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జయరాంరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మామిడి సుధాకర్, ఎంపీటీసీ సాలవ భాగ్యమ్మ, రాచాయిపేట గ్రామ సర్పంచ్ నాగదాసరి నాగేంద్ర, టీడీపీ నాయకులు పల్లెంయల్లారెడ్డి, కసిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అట్లూరు, సెప్టెంబరు 25 : అట్లూరు మండల ంలోని వేములూరు క్రాస్ రోడ్డు ఎస్సీ కాలనీకి చెందిన ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో బుధవారం కేసు నమోదు చేసినట్లు అట్లూరు ఎస్ఐ బి.రామక్రిష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి పాత గొడవలతో ఇరువర్గాల వారు ఘర్షణ పడడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాల ఆకస్మిక తనిఖీ

బి.కోడూరు, సెప్టెంబరు 25 : బి.కోడూరు ప్రభుత్వ వైద్యశాల బుధవారం జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసరు రమేశ్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. బి.కోడూరు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం వైద్యసిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. సీహెచ్‌వో నాగమణి, హెల్త్ సూపరువైజరు జాన్ విలియం పాల్గొన్నారు.

మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 25 : గ్రామీణ మహిళలు సాంఘిక, ఆర్థిక రాజకీయ, సామాజిక, విద్య, వైద్యరంగాల్లో బలోపేతం చేయడమే లక్ష్యమని వెలుగు ఏపీయం అంజ నేయులు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సాధికారత సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టీసీడీఎస్ ప్రాజెక్టుసూపర్‌వైజరు రత్నకుమారి, వీఆర్ జయపాల్, రెడ్డప్పసచివాలయ మహిళా పోలీసు నాగలక్ష్మి పాల్గొన్నారు.

మైదుకూరులో భారీ వర్షం



కూలిన పాత మిద్దె

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 25 : మైదుకూరులో సుమారు 90 ఎంఎం వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని యల్లంపల్లె నుంచి చిన్నయ్యగారిపల్లెకు పోవు రహదారి పూర్తిగా జలయమంగా మారిపోయింది.పట్టణంలోని శాంతినగర్‌లో రెండు చెట్లు కూలీపోయి, కరెంటు స్తంభాలు ఒరిగాయి. వర్షానికి పసుపు, వేరుశనగ,మిరప,టమోటా తదితర పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు నంద్యాలరోడ్డులోని ఓం శాంతి నగర్‌లో వర్షానికి పాతమిద్దె కూలింది. దీంతో నిరాశ్రయురాలైన రమణమ్మ అనే మహిళకు 17 వార్డు కౌన్సిలర్ సునీత ఆర్థిక సాయం అందించారు. వీరితో పాటు ఏఈ కిరీటి,టీడీపీ యువనాయకులు లక్ష్మీనారాయణ, యాపరాల చిన్న,సర్వేయర్ బుజ్జి తదితరులు ఉన్నారు

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 25 :వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉటి శ్రీనివాసులు కలిసి నియోజకవర్గ సమస్యలు వివరించారు. బుధవారం ఆయన ఆరోగ్యశాఖమంత్రిని కలిసి బద్వేలు ప్రాంతంలో జరుగుతున్న రెవెన్యూ అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ఆయనకు సమస్యలు వివరించారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎడిపై పాఠశాల ప్రారంభం



ధృవీకరణ పత్రాలు అందుకుంటున్న అమర్‌నాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 25: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రొద్దుటూరులో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎడిఫై పాఠశాల ప్రారంభిస్తున్నట్లు జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ వై.అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎడిఫై పాఠశాల అడ్వైజరీ ప్రిన్సిపాల్ అజయ్‌లాల్ తమ విద్యాసంస్థలకు ఫ్రాంఛైజీ ధృవీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. పది ఎకరాల సువిశాల స్థలంలో విశాలమైన ఆటస్థలం ఏసీ తరగతి గదులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఉత్తమ విద్యాబోధనే లక్ష్యంగా పాఠశాలను ప్రారంభిస్తామని తెలిపారు.

ఘనంగా సన్మానం

జమ్మలమడుగు, సెప్టెంబరు 25: కుట్లు, అల్లికలపై గిన్నిస్ రికార్డు సాధించిన రితికను క్యాంబెల్ వైద్యశాలలో డాక్టర్ అగస్టిన్‌రాజు, మరియా చారిటబుల్ ట్రస్టువారు బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జమ్మలమడుగులోని సెయింట్‌మేరీ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న రితిక వైజాగ్‌లో కుట్లు, అల్లికలపై గిన్నీస్ రికార్డు సాధించడం గర్వకారణమన్నారు. మరియా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆమెను అభినందించి మెమెంటో, నగదు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, సెయింట్‌మేరీ హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు దుస్తులు వితరణ

బద్వేలు, సెప్టెంబరు 25: పట్టణంలోని షాలోమ్ అనాథాశ్రమ చిన్నారులకు బుధవారం కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరపున రూ.35వేలతో 22 మంది చిన్నారులకు పాఠశాల యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్, సామాజిక సేవ సంఘ అధ్యక్షుడు నాగరాజు, సేవాసంఘం జనరల్ సెక్రటరీ చలపతి, మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిచంద్రశేఖర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘు,విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ కలుషితంపై సమగ్ర విచారణ జరిపించండి

మైదుకూరు రూరల్ ,సెప్టెంబ రు 25 : పవిత్రమైన తిరుమల లడ్డూను కలుషితం పై వెంటనే విచారణ చేసి కఠినంగా శిక్షించాలని అచలానందస్వామి ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి డిమాండ్ చేశారు. మైదుకూరు మాధవరాయస్వామి ఆలయం నుంచి బుధవారం హిందువులందరూ భారీ ర్యాలీ నిర్వహించారు.రాయల్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు.

విద్యార్థినిపై దాడిచేసిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలి

బద్వేలు, సెప్టెంబరు 25 :పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి మహిమను ఓ ఉపాధ్యాయురాలు కొట్టడంతో ఆ విద్యార్థి రిమ్స్ లో చికిత్స పొందుతోందని, ఆ విద్యార్థికి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. దీనిపై డీఈవో స్పందించి ఆ ఉపాధ్యాయురాలిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 25: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు గురప్పలు పేర్కొన్నారు. బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి చెకుముకి పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. పట్టణంలో దాదాపు 7,500 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. సైన్స్ ఉపాధ్యాయులు తదిరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వం వైపు ఆకర్షితులవుతున్న ప్రజలు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 25 : బీజేపీలో సభ్యత్వం నమోదు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ అన్నారు. బుధవారం ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణయ్య, బీజే వైఎం జనరల్ సెక్రటరీలు అశోక్‌కుమార్‌రెడ్డి, మాదా సురేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు ప్రారంభం

కొండాపురం, సెప్టెంబరు 25 : మండలంలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు ప్రారంభమైనట్లు టెలికాం ఇంజనీర్ మౌలాలి తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఇటీవల దేశవ్యాప్తంగా 4జీ సేవలను ప్రారంభించింది. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే పలుచోట్ల 4జీ సేవలు ప్రారంభం కాగా, కొండాపురం టెలిఫోన్ ఎక్స్చేంజి పరిధిలో కూడా 4జీ సర్వీసును ప్రారంభించినట్లు జేటీఈ తెలిపారు. ప్రైవేట్ ఆపరేటర్ల కంటే బీఎస్‌ఎన్‌ఎల్ రిచార్జీ తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది ఇటీవల బీఎస్‌ఎన్‌ఎల్ వైపు మొగ్గుచూపుతున్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించిన రితీష్‌రెడ్డి

కలసపాడు, సెప్టెంబరు 25 : గత ప్రభుత్వంలో దూలంవారిపల్లె తెలుగు కాల్వ నుంచి తణుకు చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ చేయాలని టీడీపీ బద్వేలు యువ నేత రితీష్‌రెడ్డి కలసపాడులో పాదయాత్రలో చెప్పడం జరిగింది. దీంతో వైసీపీ నాయకులు గత ప్రభుత్వంలో యుద్ధప్రాతిపదికన ఆ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించి అసంపూర్తిగా చేశారు. వాటిని బుధవారం రితీష్‌రెడ్డి, బీజేపీ నేత రోశన్న పంచాయతీ నాయకులు కలిసి పాల్గొని లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించారు.

ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

బద్వేలు, సెప్టెంబరు 25: పట్టణంలోని బాడుగ ఇండ్లలో ఉండే ప్రతి పేదవాడికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లేకపోతే వారికి ఇళ్లస్థలాలు అందించేవరకు పోరాటాలు సాగిస్తామని సీపీఎ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కరయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని చాకలి ఐలమ్మ కాలనీలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. పట్టణ కార్యదర్శి శ్రీను, చిన్ని, మోక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 25 : విజయవాడ వరద బాధితులకు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులుసేకరించిన రూ.10,120 డీడీ రూపంలో ఏపీ సీఎం ఆర్ఎఫ్ నిధికి అందజేశారు. బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ పద్మనాభమూర్తి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టరు అతిథి సింగ్‌కు అందించారు. వైస్‌ప్రిన్సిపాల్ సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 25 : మండలంలోని ముడుమాల గ్రామ పంచాయతీలోని వివిధ గ్రామాలకు సంబంధించిన రైతులు భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవే కడప, విజయవాడ నేషనల్ హైవే రోడ్డు వేయడానికి ప్రభుత్వం తీసుకున్న భూములకు దాదాపు ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా డబ్బులు ఇవ్వలేదని రైతన్నలు పనుల వద్ద ఆందోళన చేపట్టారు. ఈవిషయం తెలుసుకున్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ సంఘటనాస్థలానికి చేరుకుని నెలలోపు నష్టపరిహారం అందజేస్తానని రైతన్నలకు తెలిపారు. ఈ మేరకు ఆందోళన విరమించారు. మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్, మాజీ సర్పంచ్ బాలయ్య, సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి, సాంబశివారెడ్డి, పూజా శివాయాదవ్, నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో మంచి దిగుబడి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 25: విత్తన శుద్ధితోనే మంచి దిగుబడి వస్తుందని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏవీ.నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిప్పలూరులో పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడారు. ఏవో శ్రీకాంత్‌రెడ్డి, పశువైద్యాధికారి జ్యోతి పాల్గొన్నారు.

ముద్దనూరు..: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా చైతన్యం తెచ్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రభుత్వం చేపడుతోందని ఏవో వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి ఉప్పలూరు గ్రామంలో సర్పంచ్ పల్లా గంగయ్య ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం రామసుందర్‌రెడ్డి,ధరణి పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని సింగరాయపల్లె, మహానందిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు ఏవో ఎస్.జాకీర్ షరీఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని కొండూరు గ్రామంలో చీనీ తోటలపై యాజమాన్యం పద్ధతుల గురించి ఉద్యానపంటల అధికారి భరత్‌రెడ్డి సూచనలు సలహాలు ఇచ్చారు. బుధవారం పొలం పిలుస్తోందిలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బద్వేలు ఏడీ నాగరాజు, అట్లూరు ఏవో రామక్రిష్ణ, కొండూరు అగ్రికల్చర్ అసిస్టెంటు రామ్మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మైదుకూరు, ఖాజీపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మైదుకూరు రూరల్..: మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె,కేవలింగాయపల్లె గ్రామాలలో బుధవారం వ్యవసాయశాఖ అధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పసుపు,ఉల్లి,అరటి పంటలలో వచ్చే కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ క్రిష్ణమూర్తి, శాస్త్రవేత్త బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: పంటలను రైతు సేవాకేంద్రంలో నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఏవో జయలక్ష్మి తెలిపారు.బుధవారం ఓబుళాపురం,పిట్టిగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు ఈకార్యక్రమంలో రంపాడు సర్పంచ్ వెంకటక్రిష్ణారెడ్డి, బీటీఎం శ్రీనివాసులు, వీఏఏ వరకుమార్, నాగార్జున్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: వరి నాటే ముందు వరినారు కొలనలను తుంచి నాటితే కాండం తొలుచు పురుగు ఉధృతిని నివారించవచ్చని ఏవో నాగార్జున అన్నారు. బుధవారం మండల పరిధిలోని పుల్లూరు, త్రిపురవరం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరికల్చరల్ అసిస్టెంట్ గురప్ప, పంచాయతీ సిబ్బంది సాయితేజ, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.